
సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం • 26 • మార్చి • 2024





ఘనంగా తిరుకల్యాణోత్సవం

మన్యంకొండలో అలివేలు మంగతాయారు తిరుకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▶

గరిష్టం/కనిష్టం
39.6 /23.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కనులపండువగా ఆదిశిలావాసుడి కల్యాణం



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు నాగరాజుశర్మ, రవిచారి స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, మహాహోమం, కల్యాణం జరిపించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, బాబురావు చంద్రశేఖర్‌రావు, దీరేంద్రదాసు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైభవం.. రామలింగేశ్వరుడి రథోత్సవం

కందూర్ శ్రీరామలింగేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. భక్తుల శివనామస్మరణ, కోలాటాలు, మేళతాళాల నడుమ రథం ముందుకు కదిలింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం కూడా ఆలయ ఆవరణ కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. - అడ్డాకుల

వివరాలు 8లో ▶

‘విందు’ రాజకీయాలు..!

రసవత్తరంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ‘ఉప’ పోరు

- పోటాపోటీగా గోవాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ క్యాంప్‌లు
- బీజేపీ సైతం.. సుమారు 100 మంది కొడైకెనాల్‌కు తరలింపు
- ఓటర్లకు భారీ ఎత్తున తాయిలాలు.. ఒక్కో ఓటుకు ఒక్కో రేటు
- 28న పోలింగ్.. శిబిరాల నుంచి నేరుగా పోలింగ్ సెంటర్లకు..



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప పోరు రసవత్తరంగా మారింది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పోటాపోటీగా ఓటర్లను క్యాంప్‌లతో తరలించడంతో రాజకీయాలు హీటెక్కాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్ డీలా పడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత జరుగుతున్న తొలిపోరు కావడం, సిట్టింగ్ స్థానం కూడా కావడంతో ఆ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఇలాకా మహబూబ్‌నగర్ కాగా.. కాంగ్రెస్ సైతం పట్టువదలకుండా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో ‘విందు’రాజకీయాలతో పాటు బేరసారాలు ఊపందుకున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఓటుకు ఒక్కో రేటు పలుకుతుండగా.. భారీ ఎత్తున తాయిలాలు, ఆఫర్లతో ఓటర్లను ఆకట్టుకుంటున్నట్లు సమాచారం.

భారీగా తాయిలాలు..

ఓటర్లు చేజారకుండా ఆయా పార్టీలు క్యాంప్‌లకు తరలించి.. విందు రాజకీయాలకు తెరలేపడంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో పాటు కౌన్సిలర్లకు ఫుల్ డిమాండ్ పలుకుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్కరికి ఒక్కో రేటు నిర్ణయించడంతో పాటు నియోజకవర్గాల వారీగా కీలకంగా వ్యవహరిస్తున్న నాయకులకు సైతం పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెబుతున్నట్లు సమాచారం. ఇరు పార్టీల్లోనూ ఇప్పటికే మాట్లాడుకున్న దాని ప్రకారం ఓటర్లకు సగం అందజేయగా.. మిగతా మొత్తం పోలింగ్ రోజు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అంతేకాదు.. పలు నియోజకవర్గాలకు సంబంధించి బేరసారాలు పోటాపోటీగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకరు ఇంత ఇస్తామని చెబితే.. దానికంటే అదనంగా ఇస్తామని మరొకరు చెబుతూ ఓటర్లను తమ వైపునకు తిప్పుకుంటున్నట్లు తెలుస్తోంది.

మహిళా ఓటర్లకు ప్రత్యేక నజరానా..

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 1,439 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 795 మంది మహిళలు, 644 మంది పురుషులు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 151 మంది అధికంగా ఉండగా.. ఈ మేరకు ప్రధాన పార్టీల అభ్యర్థులు వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పలు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు క్యాంప్‌లకు వెళ్లకుండా.. తమ భర్తలను పంపారు. మిగతా ఓటర్లకు ఇచ్చిన మొత్తం కంటే అధికంగా ఇస్తామని.. చీర, సారెలు సమర్పిస్తామని.. తమకే ఓటు వేసేలా ప్రమాణం చేయించుకున్నట్లు సమాచారం.

గోవా, ఊటీ, కొడైకెనాల్..

ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పరిధిలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, పురపాలికల కౌన్సిలర్లతో పాటు ఎక్స్అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఓట్లు వేయనున్నారు. కాంగ్రెస్ నుంచి యువ పారిశ్రామిక వేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నవీన్ కుమార్ రెడ్డితో పాటు మరొకరు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ నెలకొంది. ఈ ఎన్నికల్లో మొత్తం 1,439 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అయితే 70 శాతానికి పైగా ఓటర్లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు కాగా.. వారం కిందటే ఆ పార్టీ నేతలు వారిని టూరిస్ట్ బస్సుల్లో గోవా, ఊటీ ప్రాంతాలకు తరలించారు. సుమారు వంద మంది సభ్యులున్న బీజేపీ కూడా రెండు రోజుల కిందట కొడైకెనాల్‌కు తరలించింది. తాజాగా కాంగ్రెస్ సభ్యులు సైతం ఏపీ, కర్ణాటక ప్రాంతాలకు బయల్దేరి వెళ్లారు.

గోవా శిబిరానికి కేటీఆర్..

గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను గోవా క్యాంప్‌నకు తరలించగా.. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం శిబిరాన్ని సందర్శించడం చర్చనీయాంశంగా మారింది. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లతో ఆయన భేటీ కాగా.. గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహాలు, ఓటు వేసే విధానంపై వారికి అవగాహన కల్పించినట్లు తెలిసింది. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ చల్లా, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం తదితరులు సైతం శిబిరాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు.



జెడ్పీచైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో శిబిరానికి బయల్దేరిన ప్రజాప్రతినిధులు



గోవాలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో స్థానిక ప్రజాప్రతినిధులు

ఇరువురిలోనూ భయం..

ఇరు పార్టీల ఓటర్లు పెద్దమొత్తంలో క్యాంపుల్లోనే ఉన్నారు. కొంత మంది మాత్రమే క్యాంపులకు వెళ్లలేదు. అయితే పెద్దమొత్తంలో డబ్బులు అందజేసినప్పటికీ.. వారు తమకే ఓటు వేస్తారా.. అనే భయం అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. అందుకే ఇప్పటివరకు సగం మాత్రమే చెల్లింపులు చేసిన వారు.. అన్ని జాగ్రత్తలు తీసుకుని చేసుకున్న ఒప్పందం ప్రకారం మిగతా మొత్తం చెల్లించేలా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. తమకు పూర్తిస్థాయిలో బలముందని బీఆర్ఎస్, మారిన రాజకీయ పరిణామాలు కలిసివస్తాయని కాంగ్రెస్ అభ్యర్థులు చెబుతున్నారు.

28న నేరుగా పోలింగ్ కేంద్రాలకే..

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా బీఆర్ఎస్‌కు చెందిన కసిరెడ్డి నారాయణరెడ్డి 2021లో ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయన బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కల్వకుర్తి శాసనసభకు ఎమ్మెల్యేగా పోటీ చేసి.. గెలుపొందడంతో కసిరెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఉపఎన్నిక రాగా.. ఈ నెల 28న పోలింగ్ జరగనుంది. అప్పటివరకు ఓటర్లు గోవా, ఊటీ, కొడైకెనాల్, ఏపీ, కర్ణాటకలో ఏర్పాటు చేసిన క్యాంపుల్లోనే ఉండనున్నారు. 27వ తేదీ రాత్రి వీరిని క్యాంప్‌ల నుంచి బయలు దేరి.. 28న నేరుగా పోలింగ్ కేంద్రాలకు తరలించేలా ఆయా పార్టీలు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది.

‘మూడోసారి మోదీ పీఎం కావడం ఖాయం’

అచ్చంపేట రూరల్: నరేంద్ర మోదీని **మూడోసారి** ప్రధానిగా చేయాల్సిన ఆవశ్య**కత ఎంతైనా ఉ**ందని నాగర్‌కర్నూల్ ఎంపీ **రాములు అన్నా**రు. సోమవారం అచ్చంపే**టలో విలేకరుల**తో మాట్లాడారు. దేశంలో **నీతివంతంగా,** అవినీతి రహితంగా పరి**పాలిస్తూ.. దేశ** ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిన గొప్ప నాయకుడిగా మోదీ నిలిచారని అన్నారు. దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు లేవని, కర్ఫ్యూలు లేవని చెప్పారు. గతంలో వేలాది మంది బలిదానాలు జరిగినా, అయోధ్యలో మందిరం నిర్మాణం జరగలేదని, ప్రధాని మోదీ పాలనలో అయోధ్య నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. మహిళలకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంచారన్నారు. మోదీ సర్కార్ 140 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా కరోనా వ్యాక్సిన్ ఇచ్చిందని, ప్రపంచ దేశాలు మోదీ వైపు చూస్తున్నాయని వివరించారు. దేశంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను మోదీ పరిష్కరిస్తూ.. జాతి గౌరవాన్ని పెంచుతున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయడంతో ఒరిగేదేమి లేదని, కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో చిత్తశుద్ధి కోల్పోయిందని ఆరోపించారు. జాతీయ రహదారుల విస్తరణ, రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, విమానాశ్రయాల పెంపు, పేద ప్రజలందరికీ నాణ్యమైన బియ్యం పంపిణీ, దేశ ప్రజలకు కరోనా విపత్కర సమయంలో వ్యాక్సిన్ పంపిణీ లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు.

27న అచ్చంపేటలో సమావేశం..

పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 27న బుధవారం అచ్చంపేటలోని ఏసీఆర్ గార్డెన్‌లో అచ్చంపేట నియోజకవర్గ స్థాయి బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నామని ఎంపీ రాములు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని, బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌కుమార్‌తో పాటు పలువురు బీజేపీ ముఖ్య నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.

పండుగ పూట విషాదం

- మినీ వాటర్‌ట్యాంకు కూలి బాలిక మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- నారాయణపేట గోపాల్‌పేట వీధిలో విషాదం

- వివరాలు 8లో..

‘ఆత్మ’పై పట్టింపేది?



గట్టు శివారులో మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

మూడేళ్లుగా సంస్థకు నిధులు నిల్

- జిల్లాలో సాగుపై సలహాలు, సూచనలు అంతంతే..
- ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కరువు
- నిలిచిన కిసాన్, విజ్ఞాన్ మేళాలు, పర్యటనలు

గద్వాల వ్యవసాయం: రైతులకు ఆధునిక పద్ధతుల్లో సాగు చేయడంపై అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ సాంకేతిక సంస్థ (ఆత్మ)కు గడిచిన మూడేళ్లుగా నిధులు మంజూరు కావడం లేదు. దీనివల్ల క్షేత్రస్థాయి పర్యటనలు, విజ్ఞాన, కిసాన్ మేళాల నిర్వహణ నిలిచిపోయింది. 2021–22లో ఆత్మ కార్యక్రమాల నిర్వహణకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. 2022–23, 2023–24లో అసలు ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపమని ఆదేశాలు రాలేదు. పరిస్థితి చూస్తుంటే ‘ఆత్మ’కు రాం..రాం..చెప్పినట్టే అనిపిస్తోంది.

సాగుపై అవగాహన సదస్సులు..

‘ఆత్మ’లో భాగంగా వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్యశాఖల ఆధ్వర్యంలో రైతుల కోసం వివిధ కార్యక్రమాలు చేపడతారు. వానాకాలం, యాసంగి సీజన్‌లు ప్రారంభమైన వెంటనే నూతన సాగు పద్ధతులపై అవగాహన సదస్సులతో పాటు, శిక్షణ ఇస్తారు. వ్యవసాయ క్షేత్రాలకు రైతులను తీసుకెళ్లి వారిలో సాంకేతికతను పెంపొందిస్తారు. ప్రధానంగా విజ్ఞాన యాత్రలు నిర్వహించి, కొత్త ఆధునిక యంత్రాలు, పద్ధతులపై సీడీల ద్వార అవగాహన కల్పిస్తారు. మార్కెట్‌లో వచ్చే నూతన వంగడాల గురుంచి వివరాలు తెలియజేస్తారు. మండల స్థాయిలో విత్తనోత్పత్తి, చీడ పురుగుల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తారు. మొత్తంమీద 14 రకాల కార్యక్రమాలపై ఆత్మ ద్వార నిర్వహిస్తారు.



మానవపాడు శివారులో పొగాకు దోరణాలు కడుతున్న రైతులు

నిధులు లేక నిరాధరణ

పలు ప్రయోజనాలు ఉన్న ‘ఆత్మ’పై నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. 2016–17, 2017–18లో అసలు నిధులు కేటాయించలేదు. ఫలితంగా రెండేళ్లు ఎలాంటి కార్యక్రమాలు జిల్లాలో నిర్వహించలేక పోయారు. 2018–19, 2019–20, 2020–21 అరకొరగానే నిధులు కెటాయించారు. ఆత్మకు నిధులు కెటాయించాలని 2021–22లో ఇక్కడి అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు రాలేదు. ఇక 2022–23, 2023–24లో ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులు ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీంతో అధికారులు ప్రతిపాదనలు పంపలేదు. ఇలా మూడేళ్ల నుంచి ఆత్మకు నిధులు రావడం లేదు. పరిస్థితి చూస్తుంటే ఆత్మకు ప్రభుత్వం రాం...రాం..చెప్పినట్టే అనిపిస్తోంది.

అవగాహన కల్పిస్తే ఎంతో మేలు

జోగుళాంబ గద్వాల వ్యవసాయ ఆధారిత జిల్లా. ఇక్కడ జూరాల, నెట్టెంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టులతో పాటు వేలాది చెరువులు, కుంటలు ఉన్నాయి. ప్రధానంగా పత్తి, ఆముదం, వరి, కందులు, వేరుశనగ, పప్పుశనగ, మొక్కజొన్న పంటలను ఇక్కడి రైతులు పండిస్తున్నారు. అలాగే కూరగాయలు సాగు చేస్తున్నారు. బత్తాయి, మామిడి, బొప్పాయి తదితర పండ్ల తోటలు ఉన్నాయి. మొత్తం మీద యేటా 5లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయి. చాలా చెరువుల్లో మత్స్యకారులు చేపల పెంపకాన్ని చేపడుతున్నారు. అయితే ఇప్పటికి చాలా ప్రాంతాల్లో రైతులకు ఆధునిక విధానాలపై అవగాహన లేదు. పాత పద్ధతులనే అవలంబిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ‘ఆత్మ’ ద్వార రైతులకు నూతన పద్ధతులపై అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుంది. జిల్లాలోని ప్రతి క్లస్టర్‌లో రైతు వేదికలు ఉన్నాయి. పంటల సాగులో సలహాలు, సూచనలు ఇవ్వడానికి, సదస్సులో నిర్వహించడానికి ఎంతో అనుకూలంగా ఉన్నాయి. ఆత్మకు నిధుల కేటాయింపు ఉంటేనే వీటిని నిర్వహించవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆత్మ సంస్థకు నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

ఆత్మకు నిధుల కేటాయింపు ఇలా..

ఏడాది	ప్రతిపాదనలు (రూ. లక్షల్లో)	కేటాయింపు
2018-19	25.00	6.50
2019-20	38.50	6.50
2020-21	29.70	1.00
2021-22	25.86	మంజూరీ కాలేదు
2022-23	ప్రతిపాదనలు పంపలేదు	
2023-24	ప్రతిపాదనలు పంపలేదు	

ప్రభుత్వం నుంచి నిధులు రావాలి..



ఆత్మ ద్వార కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే ఉన్నతాధికారులు తగిన ప్రతిపాదనలు అడుగుతారు. ఇక్కడి అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు నివేదిస్తాం. అయితే గడిచిన రెండేళ్ల నుంచి ప్రతిపాదనలు పంపమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు. అందుకే పంపలేదు. ప్రభుత్వం నుంచి ఆత్మ కు నిధుల కేటాయింపు జరిగితే అందుకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తాము.

– గోవిందు నాయక్, డీఏఓ



అంబరాన్నంటిన హోలీ సంబరాలు

జిల్లా కేంద్రంతో పాటు గ్రామాల్లో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం ప్రజలు హోలీ సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఆదివారం రాత్రి కాముడి దహనాన్ని నిర్వహించారు. రాజకీయ నాయకులు, అధికారులు, విద్యార్థులు, మహిళలు, పెద్ద సంఖ్యలో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అధికార, ప్రతిపక్ష నాయకుల ఇళ్ల దగ్గరకు వెళ్లి కార్యకర్తలు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు, ఆయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు తమదైన శైలిలో హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. యువకులు, చిన్నారులు శృతిమించి హోలీ వేడుకల్లో పాలుపంచుకున్నారు. సహజ వర్ణాల కంటే సింథటిక్ కలర్లు, వార్నీషులు, కందెనలను పూసుకున్నారు. గుడ్లు, టమాటాలతో కొట్టి ఆనందం పంచుకున్నారు. కృష్ణానది, జూరాల కాలువల్లో స్నానాలు చేయడానికి యువకులు పోటేత్తారు. అరకొర నీళ్లతో ఇబ్బందులు పడ్డారు. మొత్తం మీద హోలీ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. – గద్వాల



రాజోళిలో పండుగ సందర్భంగా ఉట్టి కొడుతున్న మహిళలు



వనపర్తి ఎస్పీ రక్షిత కె.మూర్తికి రంగు పూస్తున్న జోగులాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్



జిల్లా కేంద్రంలో కాముడిని దహనం చేస్తున్న యువకులు



గద్వాల స్టేడియంలో హోలీ వేడుకల్లో క్రీడాకారులు



క్లుప్తంగా

బావిలో మునిగి యువకుడు మృతి


మృతిచెందిన శ్రీకాంత్(ఫైల్)

ఖిల్లాఘనపురం: ఈత కొడుతూ బావిలో మునిగి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం మామిడిమాడ చెందిన గుడెం వెంకట్‌రెడ్డి, యాదమ్మ దంపతుల పెద్ద కుమారుడు గుడెం శ్రీకాంత్(23) సోమవారం గ్రామంలో తోటి మిత్రులతో కలిసి హోలీ జరుపుకొన్నాడు. మధ్యాహ్నం తరువాత మిత్రులతో కలిసి నేరెడు చెరువులోని షాపురం వెంకట్‌రెడ్డికి చెందిన గుండుబావికి ఈతకు వెళ్లారు. అందరు కలిసి ఈతకొడుతున్న సమయంలో శ్రీకాంత్ పై నుంచి దూకి బావి అడుగులోని మట్టిని తీసుక వచ్చాడు. కొంత సేపటికి మళ్లీ అడుగుకు వెళ్లి మట్టి తెస్తానని చెప్పి పైనుంచి దూకాడు కాని బయటకు రాలేదు. ఎంతకు రాకపోవడంతో బావిలోని మిగతా యువకులు బయంతో బయటకు వచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుని తమ్ముడు శ్రీరాం కొందరు గ్రామస్తులతో బావి దగ్గరకు వచ్చారు. బావిలోకి దూకి వెతికారు. కొంత సేపటికి ఓ వ్యక్తి నీటిలో మునిగి శ్రీకాంత్‌ను లోపలి నుంచి తీసుకొచ్చాడు. అప్పటికే మృతిచెంది ఉండటంతో కుటుంబ సభ్యులు, మిత్రులు బోరుమని విలపించారు.

చికిత్స పొందుతూ ఇద్దరు..


నారయ్య (ఫైల్)


తిర్పతయ్య(ఫైల్)

చారకొండ: మండలంలోని జూపల్లికి చెందిన అర్కంటి నారయ్య(39) నాలుగు రోజుల కిందట ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ అస్వస్థతతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో కిడ్నీ సంబంధిత వ్యాధి చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామునా మృతిచెందారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. జూపల్లికి చెందిన కడారి తిర్పతయ్య యాదవ్(40) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం హైదరాబద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. బ్రేయిన్ స్టోక్ సంబంధిత చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. గ్రామంలో మృతదేహాలను గ్రామనాయకులు నివాళి అర్పించి, కుటుంబ సభ్యులును పరామర్శించారు.

తల్లి మరణాన్ని తట్టుకోలేక కుమారుడు..


మఠం బూదెప్ప (ఫైల్)

గట్టు: తల్లి మరణాన్ని తట్టుకోలేక కుమారుడు మృతిచెందిన సంఘటన గట్టులో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గట్టుకు చెందిన మఠం ఆదెమ్మ(85) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతిచెందింది. సాయంత్రం అంత్యక్రియలను నిర్వహించారు. ఆదెమ్మ కుమారుడు మఠం బూదెప్ప(67) తల్లి మరణంతో ఆందోళన చెంది అస్వస్థతకు గురయ్యాడు. మఠం బూదెప్పను కుటుంబ సభ్యులు హుటా హుటిన రాయిచూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మఠం బూదెప్ప మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బీఆర్ఎస్‌కి చెందిన సినియర్ నాయకులు బూదెప్ప మరణంపై గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి, సానుభూతి తెలియజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు జయసింహారెడ్డి, రాము, బజారి, కృష్ణ, వెంకటేష్, వాహబ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహబూబ్ పాష తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు.

మృతదేహం అప్పగింత

జడ్చర్ల: మండల పరిధిలోని చర్లపల్లి గ్రామ శివారులో శనివారం లభించిన మృతదేహం ఆచూకీ లభించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం, ఎర్రకుంట తండాకు చెందిన రమావత్ ఫకీరమ్మ(53) ఈ నెల 23న జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లిలో ఉంటున్న తన కుమార్తె మంజుల వద్దకు వెళ్తున్నాంటూ ఇంటి వద్ద చెప్పి బయలుదేరింది. ఆమె చర్లపల్లి గ్రామ శివారులో నాటు వైద్యం చేసే గొల్ల నాగయ్య షెడ్డు వద్ద విగతజీవిగా పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తుతెలియని మృతదేహంగా గుర్తించిన పోలీసులు బాదేపల్లి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. సోమవారం మృతురాలి కుమారుడు రమావత్ జహంగీర్ వచ్చి తన తల్లిగా గుర్తించడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ తెలియజేశారు.

ఘనంగా తిరుకల్యాణోత్సవం


మన్యంకొండలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, ఇన్‌సెట్‌లో ఉత్సవ మూర్తులు


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు తిరుకల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది భక్తుల మధ్య అమ్మవారి కల్యాణతంతు చూడముచ్చటగా సాగింది. ముందుగా సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసిన శేషవాహనంలో వేంకటేశ్వరస్వామి, అలివేలుమంగతాయారు ఉత్సవ మూర్తులను వేదమంత్రోచ్చరణలు, సన్నాయి వాయిద్యాలు, కోలాటాల మధ్య గర్భగుడి నుంచి కల్యాణకట్ట వద్దకు తీసుకొచ్చారు. కల్యాణ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం జిలకర్ర బెల్లం, మంగళసూత్రదారణ నిర్వహించారు. వేదమంత్రాల మధ్య జరిగిన ఈఘట్టాన్ని భక్తులు కనులారా వీక్షించి, భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, అలివేలుమంగతాయారు దేవతామూర్తులకు పట్టు వస్త్రధారణ, తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బంగారం, వెండి ఆభరణాలు, రకరకాల పూల మధ్య దేవతామూర్తులు ధగధగ మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. కల్యాణ వేడుక అనంతరం దేవతా మూర్తులను శేషవాహనంలో గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు దేవస్థానం తరపున పసుపుకొమ్మలను ధరింపజేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి పాల్గొన్నారు.

కమనీయం.. వట్టెం వెంకన్న కల్యాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బిజినేపల్లి: వట్టెంలో సోమవారం అలివేలుమంగ, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఉప్పల కృష్ణయ్య స్వగృహం నుంచి సందడి రంగారెడ్డి, అనంత నర్సింహారెడ్డి దంపతులు తలంబ్రాలు, పట్టువస్త్రాలను మేళతాళాలు, భజన సంకీర్తనల మధ్య ఊరేంగిపుగా ఆలయానికి తీసుకొచ్చారు. దేవస్థానాచార్యులు సముద్రాల శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలకరించి, వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. జిలకర్ర బెల్లం, మాంగళ్యదారణ, తలంబ్రాలు, హోమ ప్రదక్షిణ వంటి కార్యక్రమాలను చూడముచ్చటగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థిని దీక్ష నృత్యప్రదర్శన అందరినీ అలరించింది. కల్యాణోత్సవంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవి పాల్గొన్నారు.

వైభవం.. రామలింగేశ్వరుడి రథోత్సవం




రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, వెండిముఖం స్వామి ఊరేగింపు

- కందూర్‌లో మార్మోగిన శివనామస్మరణ
- భారీగా తరలివచ్చిన భక్తజనం

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం అర్ధరాత్రి వైభవంగా సాగింది. కందూర్ నుంచి రామలింగేశ్వరస్వామి వెండి ముఖం, నాగపడగను మంగళవాయిద్యాలు, బాణాసంచా కాలుస్తూ ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ తీసుకొచ్చి రంగురంగుల పూలు, విద్యుద్దీపాలతో అలంకరించిన రథంపై ఉంచారు. రథం ముందు పోలు పోసి రథాంగ హోమం చేసి హారతినిచ్చారు. సోమవారం తెల్లవారుజామున అశేష భక్తజనం శివనామస్మరణల నడుమ రథాన్ని భక్తిశ్రద్ధలతో ముందుకు లాగారు. రథోత్సవంలో భక్తుల భజనలు, కోలాటాలు అందరిని ఆకట్టుకున్నాయి. జాతరను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. రామలింగేశ్వరుడి రథోత్సవం భక్తుల కోలాహలం మధ్య అత్యంత రమణీయంగా సాగింది. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.

అశ్వవాహనంపై రంగనాథస్వామి ఊరేగింపు


స్వామి వారిని అశ్వవాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం రంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారిని అశ్వవాహనంపై ఘనంగా ఊరేగించారు. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవాయిద్యాలు, వేద పండితుల వేదమంత్రోచ్చరణల మధ్య మూలమంత్ర హోమం, రాత్రి పారుపేట, అశ్వవాహనసేవ నిర్వహించారు. అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు గోవిందనామస్మరణతో కార్యక్రమాన్ని వీక్షించారు. వేడుక అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు విష్ణునారాయణ, అర్చకులు గోవిందాచార్యులు, సురేశాచార్యులు, కన్నయ్యస్వామి, బద్రీనాథ్ ఆచార్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలో రూ.4.55 లక్షలు స్వాధీనం


ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తున్న సీఐ శివకుమార్


ఆత్మకూర్‌లో పట్టుబడ్డ నగదును లెక్కిస్తున్న సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్

ఆత్మకూర్: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపడుతున్నామని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ తెలిపారు. సోమవారం చేపట్టిన వాహనాల తనిఖీలో మద్దూరు మండలానికి చెందిన ఎరుకలి బాలరాజు వాహనంలో రూ.1.75 లక్షలు, దామరగిద్ద మండలానికి చెందిన ఎరుకలి నర్సింహులు వాహనంలో రూ.1.60 లక్షలు, కానుకుర్తికి చెందిన ఎరుకలి వెంకటప్ప వాహనంలో రూ.1.20 లక్షల నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. రాత్రి ఆర్టీసీ బస్సుల్లో, వాహనాల్లో తనిఖీ నిర్వహించి ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. నగదు తరలింపు చేపట్టే వారు సరైన ఆధారాలు చూపెట్టకుంటే సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తనిఖీలో ఏఎస్ఐ బీచుపల్లి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బెల్టుషాప్‌లో మద్యం పట్టివేత

బాలానగర్: ఎలాంటి అనుమతి లేకుండా దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన మండలంలోని గంగధారిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ తిరుపాజీ వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతి లేకుండా మండలంలోని గంగధారిపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గడిగె శేఖర్‌గౌడ్ వద్ద సుమారు 20 లీటర్ల మద్యం పట్టుకుని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ. 63వేల నగదు స్వాధీనం

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్ చెక్‌పోస్టు వద్ద సోమవారం రూ. 63వేల నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా.. సత్యనారాయణ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా నగదును తరలిస్తుండగా, పట్టుకుని నారాయణపేట గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

28న ‘బర్రెలక్క’ వివాహం


కాబోయే వరుడితో శిరీష

కొల్లాపూర్: బర్రెలక్కగా సోషల్ మీడియాలో గుర్తింపు పొందిన కర్నె శిరీష ఈనెల 28వ తేదీన పెళ్లి చేసుకోనున్నారు. పెద్దకొత్తపల్లి మండలం పీఎంఆర్ గార్డెన్‌లో ఉదయం 9:32గంటలకు మారెడు వెంకటేష్‌తో వివాహం కానుంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొల్లాపూర్ ఎమ్మెల్యేగా పోటీచేసి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆమె వ్యక్తిగత జీవితం, కుటుంబ పరిస్థితులపై కూడా తీవ్ర చర్చ జరిగింది. ఈమె వివాహానికి సంబంధించిన వార్త ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

రామన్‌పాడులో తగ్గిన నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుంది. సోమవారం 1,011అడుగుల మేర ఉంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని చాలా రోజుల క్రితమే నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పట్టణ రెండో ఎస్ఐ రాము తెలిపారు. సోమవారం పట్టణ శివారులో గుర్తు తెలియని వృద్ధుడి(60) మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారన్నారు. వృద్ధుడి వివరాలు తెలియలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడికి సంబంధించిన కుటుంబ సభ్యులు ఎవరైన ఉంటే పట్టణ పోలీసులను సంప్రదించాలన్నారు.

నిషేధిత మత్తు పదార్థాలు తరలిస్తున్న ముఠా గుట్టురట్టు

- రూ.13లక్షల విలువైన ఆల్ఫాజోలం స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్


అనిల్‌గౌడ్


సుధాకర్


శరత్‌బాబు

కొత్తూరు: నిషేధిత మత్తుపదార్థం ఆల్ఫాజోలం తరలిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు సోమవారం వారిని మండల కేంద్రంలో చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం వెల్కిచర్లకు చెందిన అనిల్ గౌడ్(32), నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి చెందిన శరత్‌బాబు(30), మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన సుధాకర్ ఏడాది క్రితం ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముఠా నాగర్‌కర్నూల్‌కు చెందిన నర్సింహులు నుంచి పెద్ద ఎత్తున అల్ఫాజోలం సేకరిస్తున్నారు. దీన్ని జిల్లాలలోని కల్లు దుకాణాలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ కల్లు సేవిస్తున్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారనే కారణంగా ప్రభుత్వం నిషేధించింది. ఉదయం పట్టణ సమీపంలోని పాత జాతీయ రహదారి విజయలక్ష్మి కూడలి వద్ద వీరి వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఆల్ఫాజోలం తరలిస్తున్న విషయం బట్టబయలైంది. వెంటనే వారిని అరెస్ట్ చేసి సుమారు రూ..13 లక్షల విలువైన 1,030 గ్రాముల ఆల్ఫాజోలం, కారు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పండుగ పూట విషాదం

- మినీ వాటర్‌ట్యాంకు కూలి బాలిక మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- నారాయణపేట గోపాల్‌పేట వీధిలో విషాదం


కూలిన మినీ వాటర్‌ట్యాంకు..


లక్ష్మి ప్రణీత (ఫైల్)


ఘటనకు ముందు హోలీ ఆడుతూ..

నారాయణపేట రూరల్: రంగుల పండుగ హోలీ ఓ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. స్నేహితులను నిద్రలేపి మరీ హోలీ ఆడిన చిన్నారి బాలికను వాటర్‌ట్యాంకు రూపంలో మృత్యువు కబళించింది. ఈవిషాదకర ఘటన నారాయణపేట జిల్లా కేంద్రంలోని గోపాల్‌పేట వీధిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గోపాల్‌పేట వీధికి చెందిన రమేష్‌యాదవ్ – లక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. స్థానిక ఓ ప్రైవేటు స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న లక్ష్మీప్రణీత (13).. సోమవారం తన మిత్రులతో కలిసి హోలీ ఆడేందుకు వెళ్లింది. తన స్నేహితులపై రంగులు చల్లుతూ సరదాగా గడిపిన అనంతరం కాలనీలో ఉన్న మినీ వాటర్‌ట్యాంకు వద్ద శుభ్రం చేసుకుంటుండగా.. ఒక్కసారిగా కూలిపోయింది. నీటితో ఉన్న ట్యాంకు ఒక భాగం లక్ష్మీప్రణీతపై పడటంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందింది. పక్కనే ఉన్న హరిప్రియ అనే బాలికకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. మరో బాలిక నిహారికకు స్వల్పగాయాలు కాగా.. స్థానికంగా చికిత్స అందిస్తున్నారు. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే లక్ష్మీప్రణీత మృతితో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలిక మృతిపై ట్రస్మా జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కారదర్శులు ఎండీ ఖదీర్, రాజేష్, సాయి స్కూల్ నిర్వాహకులు శేషమ్మ, బాలప్ప, నర్సింహ, కూరగాయల వ్యాపారుల సంఘం సంతాపం వ్యక్తం చేశారు.

■ గోపాల్‌పేట వీధిలో ఒక బాలిక మృతి, మరో ఇద్దరు గాయపడటానికి కారణమైన మినీ వాటర్ ట్యాంకును దాదాపు పదేళ్ల కిందట నిర్మించారు. అది శిథిలావస్థకు చేరుకున్నా.. వినియోగిస్తూ వస్తున్నారు. మరోపక్క ట్యాంకు సమీపంలో ఇటీవల ఓ ప్రైవేటు బోరు తవ్వడం.. ట్యాంకు పక్కనే ఆదివారం రాత్రి పెద్దఎత్తున కాముడి దహనం వేడుక నిర్వహించడంతో మరింత దెబ్బతిందని తెలుస్తోంది. సోమవారం సైతం కాముడిదహనం మంటలు అలాగే ఉన్నాయి. అక్కడే ఖాళీగా ఉన్న మరో మినీ వాటర్‌ట్యాంకు మంటల వేడికి నెర్రలుబాసింది. దీన్ని గమనించకుండా ట్యాంకులోకి నీళ్లు నింపడం వల్ల కూలిపోయింది.

బొటానికల్ గార్డెన్‌లో విరబూసిన సీతాఅశోక


బొటానికల్ గార్డెన్‌లో విరమూసిన సీతాపుష్పం అశోక

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న బొటానికల్ గార్డెన్‌లో అరుదైన సీతా అశోక చెట్టు పుష్పించిందని గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య తెలిపారు. శాస్త్రీయంగా సరాక అశోక అంటారని, చెట్టులోని ప్రతి భాగము ఔషధమేనని ఆయన వివరించారు. దీని నుంచి అసోకారిష్టము అనే మందు తయారి చేస్తారని, స్త్రీ సంబంధ వ్యాధులు నయం చేయటానికి ఉపయోగిస్తారన్నారు. చెట్టుకు పురాణేతిహాసాలోనూ చాలా ప్రాధాన్యత ఉందన్నారు. బుద్ధుడు అశోక చెట్టు కింద జన్మించాడని, మహావీరుడు అశోకవనంలో సన్యాసం తీసుకున్నాడని ప్రతీతి. అదేవిధంగా రామాయణంలో సీతాదేవిని అశోకవనంలో రావణుడు బంధించాడని ప్రస్తావించబడిందని తెలిపారు. అశోక చెట్టు ఎక్కడ ఉంటే అక్కడ శోకము ఉండదని అంటారన్నారు. అందుకే ఆ చెట్టుకు అశోక అని పేరు వచ్చిందన్నారు. గార్డెన్‌లో పెంచుతున్న మొక్కలను యోగివేమన విశ్వవిద్యాలయం లీడ్ బొటానికల్ గార్డెన్ నుంచి సేకరించామని, అంతరించి పోతున్న మొక్కల జాబితాలో ఇది ఉందన్నారు. తెలంగాణ అడవుల్లో కేవలం సలేశ్వరం వద్ద మాత్రమే అశోక పెరుగుతుందన్నారు.

పక్షుల సందడి..



జూరాల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో పక్షులు విహరిస్తూ, సందడి చేస్తున్నాయి. మధ్యాహ్నం వేళ భానుడి ప్రతాపానికి తాళలేక జూరాల నీటిలో సేద తీరుతున్నాయి. ప్రాజెక్టు ఒడ్డున సోమవారం ఒకే చోట గుంపులు గుంపులుగా పక్షులు సేద తీరుతుండగా ‘సాక్షి’ క్లిక్‌మనిపించింది. – గద్వాల అర్బన్

108 వాహనంలో ప్రసవం

వైద్యుల తీరుతో ఇబ్బందులు పడ్డామంటున్న కుటుంబసభ్యులు


కుటుంబ సభ్యులకు శిశువును అప్పగిస్తున్న ఈఎంటీ మల్లేష్

అమ్రాబాద్: గర్భిణికి ఆస్పత్రిలో ప్రసవం చేయక పోవడంతో 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో కాన్పు జరిగింది. కుటుంబీకులు, 108 సిబ్బంది కథనం మేరకు.. అమ్రాబాద్ మండలం ఉప్పునుంతల(బీకే)కు చెందిన చెంచు మహిళ మెండె వెంకటమ్మ ఆదివారం రాత్రి పురిటి నొప్పులతో బాధ పడుతుండగా.. భర్త లింగయ్య, కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. వాహనం రాగానే వెంటనే అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన సిబ్బంది అచ్చంపేటకు తీసుకెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి అచ్చంపేట ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి సిబ్బంది కూడా పరీక్షించి నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆందోళనతో కుటుంబ సభ్యులు అదే అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్‌కు బయలుదేరగా మార్గమధ్యంలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 సిబ్బంది ఈఎంటీ మల్లేష్, పైలెట్ కిరణ్ వాహనంలోనే కాన్పు చేయగా ఆడ శిశువు జన్మించింది. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించారు. ప్రసవం కోసం మారుమూల ప్రాంతం నుంచి అమ్రాబాద్ ఆస్పత్రికి వస్తే అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌కు పంపించడం ఏమిటని, ఆయా ఆస్పత్రుల్లో వైద్యులు, వసతులు లేవా అని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 8573633520,89197 39694.

■ పరిశ్కృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18k. ఫోన్: 9640468899 / 9640258899

■ కొత్తగా ప్రారంభించిన మా యాడ్ ఏజెన్సీ కంపెనీలో జాబ్ చేయుటకు 38 స్త్రీ/పులు కావలెను. జీ. 14వేలు+ DA 8వేలు+క్రీడం, భోజనం, నోటీఘ్, సర్టిఫికేట్, Q: 7th-డిగ్రీ(P/F). మహబూబ్ నగర్ 93463 32825.

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలనగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తరపు లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజ్‌మెంట్